సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం ౹ 30 ౹ జనవరి ౹ 2025



విద్యుత్ వెలుగుల్లో చాపరాయి జల విహారి

న్యూస్‌రీల్

ఫిబ్రవరి 27న ఎమ్మెల్సీ ఎన్నికలు

- అమల్లోకి కోడ్
- కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ, తూర్పు,పశ్చిమగోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఫిబ్రవరి 27న జరుగుతున్నందున ఈమేరకు జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా సభ్యుల కాలపరిమితి మార్చి 29తో ముగియనున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిందన్నారు. ఈ రెండు నియోజకవర్గాలకు ఫిబ్రవరి 3న నోటిపికేషన్ జారీ చేయడం జరుగుతుందని, 10వతేదీ వరకు నామినేషన్లు స్వీకరణ,11న పరిశీలన, 13లోగా నామినేషన్లు ఉపసంహరణ ఉంటుందన్నారు. 27వతేదీ ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరుగుతుందని, మార్చి 3వతేదీన కౌంటింగ్ ఉంటుందన్నారు. అమల్లోకి వచ్చిన ఎన్నికల ప్రవర్తన నియామవళిని కచ్చితంగా పాటించాలని కలెక్టర్ ఆదేశించారు.

80 మందికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు

- డీసీహెచ్ కృష్ణారావు



శస్త్ర చికిత్స చేస్తున్న వైద్యాధికారులు

హుకుంపేట: మండలంలోని ఉప్ప ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 80మందికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేసినట్లు (డీసీహెచ్‌ఎస్) జిల్లా వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ డా.కృష్ణారావు తెలిపారు. బుధవారం ఉప్ప ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రిలో స్థానిక వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో శస్త్రచికిత్సలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు రేఖ, లక్ష్మీకాంత్, శివప్రసాద్, బిందు,సందీప్, నిఖిల్, రాణాప్రతాప్, కిషోర్ పాల్గొన్నారు.

జన్‌మన్ ఇళ్లు వేగవంతం చేయాలి

- లబ్ధిదారులకు హౌసింగ్ పీడీ బాబు సూచన



తరిగెడలో గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ బాబు

ముంచంగిపుట్టు: ప్రధానమంత్రి జన్‌మన్ గృహాలు త్వరితగతిన పూర్తిచేయాలని హౌసింగ్ పీడీ బి.బాబు సూచించారు. బుధవారం మండలంలోని కిలగాడ పంచాయితీ తరిగెడలో ఆయన పర్యటించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం గృహాల మంజూరు, నిర్మాణాల్లో పాటించాల్సిన నిబంధనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి పీఎం జన్‌మన్‌లో 3,400 ఇళ్లు మంజూరు అయ్యాయన్నారు. ప్రతి ఒక్కరు నిబంధనలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పీఎంఏవై ద్వారా గ్రామాల్లో ఇళ్ల మంజూరుకు సర్వే చేయిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. వీటికి అర్హులైన ప్రతి ఒక్కరు వారి ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకొని ఈకేవైసీ చేసుకోవాలని ఆయన కోరారు. మండల హౌసింగ్ ఏఈ కృష్ణారావు,హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మరక్ష పరిరక్షణ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం


పాడేరు రూరల్: రాణి లక్ష్మీబాయి ఆత్మ రక్ష పరిరక్షణ పథకంలో శిక్షణ ఇచ్చేందుకు అర్హత గల సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సమగ్ర శిక్ష ఏపీసీ స్వామినాయుడు తెలిపారు. జిల్లాలో 92 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో ఆరు నుంచి 8వ తరగతి విద్యార్థులతో పాటు జెడ్పీ, కేజీబీవీ, గిరిజన సంక్షేమశాఖ ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి 9 వరకు చదువుతున్న విద్యార్థులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఫిబ్రవరి ఒకటి నుంచి 15 వరకు 20 సెషన్స్ కింద కరాటే, తైక్వాండో వంటి యుద్ధ కళల్లో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఆయా కళల్లో కనీసం మూడేళ్ల అనుభవం ఉన్న సంస్థలు ఫిబ్రవరి ఒకటో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

- కోల్డ్ ఫెస్టివల్

మన్యానికి పండగొచ్చింది



పద్మాపురం గార్డెన్లో హాట్ ఎయిర్ బెలూన్



పద్మాపురం గార్డెన్ ముఖద్వారం వద్ద అలంకరణ

- అరకులోయలో రేపటి నుంచి అరకు చలి ఉత్సవాలు
- మూడు రోజులపాటు నిర్వహణ
- ముస్తాబు అవుతున్న పర్యాటక ప్రాంతాలు
- ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేస్తున్న అధికార యంత్రాంగం

మన్యం ప్రకృతి సొగసుల నిలయం. ఎటుచూసినా కనువిందు చేసే పచ్చని అందాలు.. జలపాతాల గలగలలు.. కొండ కోనల్లో సాగే ప్రయాణాలు.. పలకరించే కాఫీతోటలు.. ఆకట్టుకునే గిరిజనుల సంప్రదాయాలు.. ఇలా ఒక్కటేమిటి ఎన్నో అందాల సమాహారం. అందుకే అరకులోయ ఆంధ్రా ఊటీగా ఖ్యాతిగాంచింది. ప్రపంచ స్థాయి పర్యాటకుల మదిని దోచుకుంది. ఇంతటి పేరుగాంచిన అరకులోయ చలి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలు ఈనెల 31న ప్రారంభమై వచ్చే నెల 2వ తేదీతో ముగుస్తాయి. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి.



అరకు పద్మాపురం గార్డెన్‌లో పార్కు

సాక్షి, పాడేరు: అరకు.. ఎన్నెన్నో అందాలకు పెట్టింది పేరు. సీజన్ ఏదైనా ఇక్కడికి వచ్చే సందర్శకులు మంత్ర ముగ్ధులవుతుంటారు. ఇటువంటి ప్రకృతి దృశ్యాలను చూడడం ఒక లైఫ్ టైమ్ ఎక్స్‌పీరియన్స్ అంటుంటారు పర్యాటకులు. గిరిజన ఆచార, సంప్రదాయలకు వేదికగా పండగ వాతావరణంలో అరకు చలి ఉత్సవాలు నిర్వహించేందుకు ఈ ప్రాంతం ముస్తాబు అవుతోంది.

గాలిలో తేలిపోయేలా పారా గ్లైడింగ్..

ఐటీడీఏ ఆధ్వర్యంలో పారా గ్లైడింగ్ అందుబాటులోకి తెస్తున్నారు. మాడగడ వ్యూపాయింట్ ప్రత్యేకతను పర్యాటకులకు చూపిస్తూ ఈ పారా గ్లైడింగ్ ఏర్పాటుతో అరకు చలి ఉత్సవాలను మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

భూతల స్వర్గం..

అరకులోయకు పూర్వం నుంచి ఆంధ్రా ఊటీగా పేరుంది. పర్యాటక ప్రాంతం అరకులోయ ప్రపంచ దేశాల పర్యాటకులను కూడా ఆకర్శిస్తుంది.భారతదేశాన్ని పర్యటించే అనేక దేశాల పర్యాటకులు అరకులోయను మరచి పోకుండా సందర్శిస్తుండటం విశేషం.

రోడ్డు మార్గంలోనూ అందాలే

విశాఖపట్నం నుంచి అరకులోయ రోడ్డు మార్గంలో కూడా ప్రకృతి అందాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. కొండల నడుమ ఘాట్‌రోడ్డులో ప్రయాణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఎత్తయిన గాలికొండ మరింత ఆకర్షిస్తుంది. డముకు వ్యూపాయింట్‌ల వద్ద పర్యాటకులు సందడి ఉంటుంది. సుంకరమెట్ట సమీపంలోని కాఫీతోటలను అటవీ పర్యాటకంలో భాగంగా అభివృద్ధి చేశారు.



అరకు గిరిజన మ్యూజియం



అరకులోయ చేరుకున్న హెలికాప్టర్

గిరిజన మ్యూజియం... పద్మాపురం గార్డెన్

గిరిజన మ్యూజియంలో గిరిజన ఆచార సంప్రదాయాలను ప్రతిబింబించే కళాకృతులు ప్రత్యేక ఆకర్షణ. గిరిజన మ్యూజియంలో బోటుషికారు ఉంది. పలు సాహస క్రీడలు అందుబాటులో ఉన్నాయి. పద్మాపురం బొటానికల్ గార్డెన్‌లో పూలజాతుల మొక్కలతో పాటు, ఔషధ, పండ్ల జాతుల చెట్లు కూడా ఉన్నాయి.ఇక్కడ టాయ్‌ట్రైన్‌లో ప్రయాణం చిన్నారులను ఎంతో ఆకట్టుకుంటుంది. గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ.30 లక్షలతో గార్డెన్‌లో అనేక సౌకర్యాలను కల్పించారు.ఇటీవల ఐటీడీఏ కూడా మరో రూ.70లక్షలతో గార్డెన్‌ను ఆధునికీకరించింది. ట్రీహట్స్ ప్రత్యేక ఆకర్షణ.

లేలేత కిరణాలతో..

అరకులోయ సమీపంలోని మాడగడ వ్యూపాయింట్ పర్యాటకులను ఎంతో ఆకర్షిస్తుంది. ఎత్తయిన ఈ కొండపై వేకువజామున పొగ మంచు, సూర్యోదయం అందాలను వీక్షించేందుకు పర్యాటకులు భారీగా తరలివస్తుంటారు.

కళాకారులకు వసతి ఏర్పాట్లు..

అరకు ఉత్సవ్ కోసం వచ్చే కళాకారులకు వసతి, భోజన, రవాణా తదితర అవసరాలను పూర్తి చేయాలని, ఈ మేరకు అవసరమైన కమిటీలను ఏర్పాటు చేసి అధికారులకు విధులు, బాధ్యతలను స్పష్టం చేయాలని కలెక్టర్ ఇప్పటికే ఆదేశించారు.అలాగే, ఉత్సవాలకు అయ్యే ఖర్చులపై బడ్జెట్ అంచనాలను సిద్ధం చేయాలని సూచించారు.

హెలికాప్టర్‌లో అందాలు తిలకించేలా..

అరకు చలి ఉత్సవానికి వచ్చే పర్యాటకులు ఆకాశంలో విహరిస్తూ మన్యం అందాలను తిలకించేలా అధికార యంత్రాంగం హెలికాప్టర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఉత్సవాల మూడు రోజులు ఇది ఉంటుంది. దీనిలో విహరించే వారు రూ.3,500లు చెల్లించాల్సి ఉంటుంది. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. హెలిప్యాడ్ వద్ద స్పాట్ బుకింగ్ సౌకర్యం ఉందని ప్రైవేట్ అడ్వెంచర్ సంస్థ నిర్వాహకుడు శివ తెలిపారు.

రూ.కోటి నిధులు మంజూరు



పర్యాటక ప్రాంతం అరకులోయలో చలి అరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నాం.రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి నిధులను మంజూరు చేసింది. వీటిని పారదర్శకంగా వినియోగిస్తాం. మూడు రోజుల ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తాం.

– ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్, పాడేరు

ప్రపంచ ఖ్యాతి బొర్రాగుహలు



అనంతగిరి మండలంలోని బొర్రాగుహలు ప్రపంచ ఖ్యాతి పొందాయి. విదేశాలలో కూడా బొర్రాగుహలను పర్యాటకులు గొప్పగా చెప్పుకుంటారు. వీటిలో పలు ఆకృతులలో శిలాసంపద కనువిందు చేస్తుంది. సందర్శకులను ఆకట్టుకునే పర్యాటకశాఖ విద్యుత్ వెలుగులతో సుందరీకరించింది.

డిగ్రీ కళాశాలలో వేదిక

అరకులోయ టౌన్: అరకు చలి ఉత్సవం-2025 గిరిజన సంస్కృతికి అద్దం పట్టేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వేదిక ఏర్పాటుచేస్తున్నారు. పద్మాపురం ఉద్యానవనంలో ఫ్లవర్ షో వివిధ రకాల పూలతో ఆకర్షణీయంగా ఏర్పాట్లు చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈనెల 31వ తేదీ ఉదయం 7.30 గంటలకు పద్మాపురం ఉద్యానవనం నుంచి స్థానిక డిగ్రీ కళాశాల మైదానం వరకు అరకు మారథాన్ పేరుతో 5కె రన్‌తో ఉత్సవాన్ని ప్రారంభిస్తారు. ఉత్సవాలు నిర్వహించే మూడు రోజులు సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ ఉత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా హాట్ ఎయిర్ బెలూన్, పారా గ్లైడింగ్‌ను ఏర్పాట్లు చేస్తున్నారు.



అరకు డిగ్రీ కళాశాల మైదానంలో ఉత్సవ ఏర్పాట్లు



మాడగడ వ్యూపాయింట్ వద్ద ఆకట్టుకుంటున్న ఉదయభానుడి అందాలు

రైలులో ప్రయాణం అద్భుతం



అరకులోయకు రైలు ప్రయాణం అబ్బురపరుస్తుంది. విశాఖలో ఉదయం 7గంటల సమయంలో బయలుదేరే విశాఖ-కిరండోల్ పాసింజర్ విస్టాడోమా కోచ్‌లో ప్రయాణించేందుకు పర్యాటకులు ఇష్టపడతుంటారు. కొండల నడుమ సాగే ఈ ఆహ్లాదకర ప్రయాణంతో పర్యాటకులు పరవశిస్తారు. బొడ్డవర ప్రాంతం నుంచి అరకులోయ సమీపంలోని కరకవలస వరకు రైలు ప్రయాణం ఎత్తయిన కొండల మధ్య సాగుతుంది. పట్టపగలు కూడా టన్నెల్స్ దాటే సమయంలో నెలకొన్న చీకటిలో రైలు ప్రయాణం పర్యాటకులను ఎంతో గానో ఆకట్టుకుంటోంది. ఈ మార్గంలో మొత్తం 52 టన్నెళ్లు ఉన్నాయి. బొర్రా-చిమిడిపల్లి స్టేషన్ల మధ్య 900మీటర్ల పొడవున ఉన్న భారీ టన్నెల్‌ను రైలు దాటేందుకు సుమారు 20 నిమిషాలు పడుతుంది. మిగతా టన్నెల్స్ 200 మీటర్ల పొడవు లోపునే ఉంటాయి. బొర్రా గుహల మీదుగా రైలు పట్టాలు ఉండడం మరో ప్రత్యేకత.

జలపాతాల హోరు



అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగుడ మండలాల్లో జలపాతాలు పర్యాటకులు,చిన్నారులను ఆహ్లాదపరుస్తుంటాయి. ఈ ప్రాంతానికి వచ్చే వారంతా సమీపంలోని 300 మీటర్ల ఎత్తునుంచి జాలువారే కటికి జలపాతాన్ని సందర్శిస్తుంటారు. ఇక్కడ ట్రెక్కింగ్ క్యాంప్‌లు కూడా తరచూ జరుగుతాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సుమారు రూ.4కోట్లతో పక్కా రోడ్డు నిర్మించింది. ఇదే కాకుండా సమీపంలో తాడిగుడ, రణజిల్లెడ, కొల్లాపుట్టు, చాపరాయి జలపాతాలను సందర్శిస్తుంటారు.

గిరిజన చట్టాలను హరిస్తే సహించం

- 1/70 చట్టానికి తూట్లు పొడిచేలా స్పీకర్ అయ్యన్న పాత్రుడి వ్యాఖ్యలు
- గిరిజన ప్రాంత అభివృద్ధికి నిధులు కేటాయించకుండా వివక్ష
- ఖనిజ సంపదను కొల్లగొట్టేందుకు కొత్త డ్రామా
- బినామీల రాజ్యానికి కూటమి నేతల సారథ్యం
- పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు ధ్వజం



మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు



ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సురేంద్ర, తదితరులు

పాడేరు : గిరిజన చట్టాలు, హక్కులను హరించేలా పాలకులు, కూటమి నేతలు వ్యవహరిస్తే తాము చూస్తూ ఊరుకునేది లేదని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు హెచ్చరించారు. బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. విశాఖలో జరిగిన ఓ కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలు 1/70 చట్టానికి తూట్లు పొడిచేలా ఉన్నాయన్నారు. గిరిజన ప్రాంతం అభివృద్ధి చెందాలంటే 1/70 చట్టాన్ని సవరించాలని ఎందుకు మాట్లాడారని ప్రశ్నించారు. గిరిజన ప్రాంత అభివృద్ధికి నిధులు కేటాయించకుండా వివక్ష చూపుతూ చట్టాలను సవరించాలని మాట్లాడటం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. గిరిజన ప్రాంతంలో దాగి ఉన్న అపారమైన ఖనిజ సంపదను కొల్లగొట్టేందుకే అయ్యన పాత్రుడు ఈ విధంగా మాట్లాడారన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా గిరిజన ప్రాంతం జోలికి ఎందుకు వస్తున్నారని ధ్వజమెత్తారు. గిరిజన ప్రాంత హక్కులు, చట్టాలు ఉల్లంఘించేలా మాట్లాడిన స్పీకర్ అయ్యన్నపాత్రుడిపై రాష్ట్ర గవర్నర్, రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. గిరిజన చట్టాలు, హక్కులు నిర్వీర్యం చేసేలా కూటమి ప్రభుత్వం, నాయకులు చేసే ప్రతి చర్యను తాము అడ్డుకుంటామన్నారు. అవసరమైతే తన పదవులకు రాజీనామా చేసి స్థానిక ఆదివాసీలతో కలిసి ఉద్యమం చేపట్టి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. గిరిజన ప్రాంతంలో బినామీల రాజ్యం నడుస్తోందన్నారు. 1/70 చట్టానికి తూట్లు పొడుస్తూ బినామీల ద్వారా యథేచ్ఛగా అక్రమ

మిగతా 8వ పేజీలో ▶

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

పాడేరు : వైఎస్సార్‌సీపీ పాడేరు, అరకు అసెంబ్లీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను ఆ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం సాయంత్రం ప్రకటించింది. ఆ వివరాలు ఇవీ.

పాడేరు అసెంబ్లీ: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా శరభ సూర్యనారాయణ, పంచాయతీరాజ్ విభాగం బిడిజాన అప్పారావు, యువజన విభాగం లంబసింగి రమేష్, మహిళ విభాగం అధ్యక్షురాలిగా కిల్లో ఊర్వశిరాణి, రైతు విభాగం కంకపాటి రామారావు, బీసీ సెల్ చందక త్రినాథరావు, ఎస్సీ సెల్ తలివెల డానియల్, మైనార్టీ విభాగం సైక్ సత్తార్, క్రిస్టియన్ మైనారిటీ విభాగం వంతాల కృష్ణారావు, వలంటీర్ల విభాగం మత్స్యరాస కూర్మరాజు, గ్రీవెన్స్ విభాగం దూసురి గంగరాజు, వాణిజ్య విభాగం వనపల రాజేష్, కల్చరల్ విభాగం దాసరి మత్స్యరాజు, సోషల్ మీడియా విభాగం బండి సుధాకర్, ఐటీ విభాగం నీలపు సూరిబాబు, ప్రచార విభాగం అధ్యక్షుడిగా లంకెల కల్యాణ్‌ను నియమించింది.

అరకు అసెంబ్లీ: వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా సందడి కొండబాబు, యువజన విభాగం అధ్యక్షుడిగా రేగం శివరామకృష్ణ, మహిళ విభాగం అధ్యక్షురాలిగా సమిడ వెంకట పూర్ణిమ, రైతు విభాగం రంసల రామన్నదొర, బీసీ సెల్ గెద్దం నర్సింగరావు, ఎస్సీ సెల్ మెంతె మోహన్‌రాజు, ఎస్టీ సెల్ రేగబోయిన స్వామి, మైనార్టీ సెల్ మాహమ్మద్ యాసిన్, క్రిస్టియన్ మైనార్టీ విభాగం పాంగి డేవిడ్‌రాజు, విద్యార్థి విభాగం బత్తిరి చరణ్‌తేజ, పంచాయతీరాజ్ విభాగం కె.వెంకటరావు, ఆర్టీఐ విభాగం గల్లెల అర్జున్, వలంటీర్ల విభాగం మునరి భవానీశంకర్, వాణిజ్య విభాగం మొగలిపూరి రాధకృష్ణ, వీవర్స్ విభాగం కావు శ్రీనివాసరావు, వైఎస్సార్ టీయూసీ కిల్లో నోభో, అంగన్‌వాడీ విభాగం పాడి కవిత, లీగల్ సెల్ వంతాల అప్పారావు, కల్చరర్ విభాగం పాండోయ్ శాంతి, సోషల్ మీడియా విభాగం కొర్రా రమేష్, ఐటీ విభాగం కావు మాధవరావు, దివ్యాంగుల విభాగం కరింగయ జయదేవ్, వైద్యుల విభాగం పొట్టంగి ప్రశాంత్‌బాబు, ఇంటలెక్చువల్ విభాగం జర్సింగి రామునాయుడు, బూత్ కమిటీ పాంగి విజయ్ కుమార్, ప్రచారం విభాగంవంతాల కొండలరావును నియమించింది.

చర్మవ్యాధి తగ్గే వరకు వైద్యశిబిరాలు

- కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం
- లండూలు గ్రామంలో పర్యటన



లండూలు గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్ దినేష్‌కుమార్

పెదబయలు: చర్మవ్యాధులు ప్రబలిన గ్రామాల్లో చిన్నారులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించడంతోపాటు ఆయా గ్రామాల్లో నిరంతరం వైద్యశిబిరాలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన లండూలు గ్రామంలో పర్యటించారు. తాగునీటి పథకం మంజూరు చేయాలని, సిమెంట్ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఆయనను కోరారు. లండూలు గ్రామం నుంచి వలసల బంద వరకు రోడ్డు నిర్మించాలని వారు విన్నవించారు. గిన్నెలకోట పంచాయతీలో పదేళ్ల లోపు చిన్నారులకు చర్మవ్యాధులు ప్రబలడంపై కలెక్టర్ ఆరా తీశారు. ఆయా గ్రామాల్లో ఆహార అలవాట్ల వివరాలను తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో సాధారణ పరిస్థితి వచ్చే వరకు ప్రతిరోజు వైద్యశిబిరాలు నిర్వహించాలని వైద్యసిబ్బందికి సూచించారు. పరిస్థితులు ఏమాత్రం బాగులేకపోయినా వెంటనే ఆస్పత్రికి తరలించాలని రూడకోట పీహెచ్‌సీ వైద్యాధికారి సత్యారావును కలెక్టర్ ఆదేశించారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

మంచుతో ఇబ్బందులు



చింతపల్లిలో దట్టంగా కురుస్తున్న మంచు

చింతపల్లి: మన్యంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ముంచంగిపుట్టులో బుధవారం 13.5 డిగ్రీలు నమోదు అయినట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. పాడేరు డివిజన్ పరిధి పెదబయలులో 13.7, జి.మాడుగులలో 14.5, హుకుంపేటలో 14.9 ,చింతపల్లిలో 15.0, గూడెం కొత్తవీధిలో 15.0, అరకువేలిలో 15.2, పాడేరులో 15.7, అనంతగిరిలో 15.8 ,డుంబ్రిగుడలో 17.4, కొయ్యూరులో 17.8 డిగ్రీలు నమోదు అయినట్టు ఆయన పేర్కొన్నారు.

క్లుప్తంగా

మధ్యవర్తిత్వానికి ప్రాధాన్యమివ్వండి



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, చిత్రంలో ఇతర న్యాయమూర్తులు

విశాఖ లీగల్: కేసుల విచారణకు ముందు మధ్యవర్తిత్వ కేంద్రానికి బదిలీ చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ పలువురు న్యాయమూర్తులను కోరారు. విశాఖ జిల్లా కోర్టు ప్రాంగణంలోని శిక్షణ కేంద్రంలో బుధవారం న్యాయమూర్తులు, ఇతర ముఖ్యులకు 'మధ్యవర్తిత్వం-కేసుల రాజీ'అన్న అంశంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గిరిధర్ మాట్లాడుతూ కేసులు మధ్యవర్తిత్వం ద్వారా త్వరగా పరిష్కారమవుతాయని స్పష్టం చేశారు. ఉభయ పక్షాలు తమ వాదన వినిపిస్తే మధ్యవర్తిత్వ కేంద్రం ద్వారా తగిన పరిష్కారం దొరికే అవకాశం ఉందన్నారు. జాతీయ మధ్యవర్తిత్వ శిక్షకులు, చెన్నైకి చెందిన రత్నతార, సత్యారావు మాట్లాడుతూ కోర్టులో దాఖలైన ప్రతి కేసు తొలుత మధ్యవర్తిత్వ కేంద్రానికి పంపించాలని సూచించారు. ఈ కేంద్రం ద్వారా దాదాపు 50 నుంచి 60 శాతం కేసులు రాజీ అయ్యే అవకాశం ఉందన్నారు. శిక్షణలో అదనపు జిల్లా న్యాయమూర్తులు, విశాఖపట్నం, అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, అల్లూరి ప్రాంతాల నుంచి న్యాయమూర్తులు హాజరయ్యారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ పాల్గొన్నారు.

ఆస్పత్రికి బలవంతంగా గర్భిణి తరలింపు



అంబులెన్స్‌లో గర్భిణిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న వైద్యాధికారి అచ్యుత్, సిబ్బంది

గూడెంకొత్తవీధి: ప్రసవం కోసం గర్భిణిని ఆస్పత్రికి బలవంతంగా తరలించాల్సి వచ్చింది. బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివ రాలు ఇలా ఉన్నాయి. దేవరాపల్లి సచివాలయం పరిధిలోని మారుమూల ఉన్న జర్రల బంద గ్రామానికి చెందిన గెమ్మెలి రాధ అనే గర్భిణికి ప్రసవ తేదీ సమీపించడంతో ఆస్పత్రిలో చేరాల్సి ఉంది. అయినా ఆమె ఆస్పత్రికి రాకుండా గ్రా మంలోనే ఉండిపోయింది. వైద్య సిబ్బంది నచ్చజెప్పినా ఆమె నిరాకరించడంతో బుధవారం గూ డెంకొత్తవీధి పీహెచ్‌సీ వైద్యాధికారి అచ్యుత్ అంబులెన్స్, వైద్య సిబ్బందితో ఆమెను తీసుకొచ్చేందుకు బయలుదేరి వెళ్లారు. ఆస్పత్రికి రాకుండా సమీపంలోని కాఫీతోటల్లోకి వెళ్లిపోయింది. దీంతో వైద్యాధికారి సిబ్బంది సహాయంతో కాఫీ తోటల్లోకి వెళ్లి గర్భిణికి నచ్చచెప్పి ఆమెను అంబులెన్సులో ఆస్పత్రికి ప్రసవం కోసం తీసుకువెళ్లారు.

పీసా చట్టంపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న పీవో కట్టా సింహాచలం



హాజరైన సభ్యులు

రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం: పీసా కమిటీ సభ్యులకు చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఏజెన్సీలోని 120 పంచాయతీల్లో ఎన్నికైన పీసా కమిటీ ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, సర్పంచ్‌లకు పీసా గ్రామ కమిటీ అధికారాలు, తీర్మానాలపై ఒక రోజు అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవో సింహాచలం మాట్లాడుతూ పీసా కమిటీ సభ్యులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేయాలన్నారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలను పీసా చట్టం ద్వారా గ్రామసభ తీర్మానాలతో అమలు చేసేందుకు సభ్యులు అవగాహన ఉండే విధంగా శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. పీసా చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మన్యంలో గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఫిబ్రవరి 4 నుంచి మండల స్థాయిలో సర్పంచ్‌లకు, పీసా ఉపాధ్యక్షులు, కార్యదర్శులకు పీసా చట్టంపై పూర్తిస్థాయిలో అవగాహన, శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందే విధంగా పీసా గ్రామ కమిటీల ద్వారా తీర్మానాలు చేయాలన్నారు. ఏజెన్సీలో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, 1/70 చట్టం ప్రకారం గిరిజనేతరులకు భూములు విక్రయించొద్దని సూచించారు. అర్హులైన వారికి కులధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. తప్పుడు సర్టిఫికెట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సాహించొద్దన్నారు. రాష్ట్ర గిరిజన సలహాదారుడు త్రినాథరావు మాట్లాడుతూ గ్రామసభ తీర్మానాలు చేసుకునే విధంగా హక్కులు కల్పించడం జరిగిందన్నారు. పీసా చట్టంపై రూపొందించిన బుక్‌లెట్‌లను పీవో ఆవిష్కరించారు. డీఎఫ్ఓ అనూష, ఏపీవో రమణ, ఎంపీడీవో శ్రీనివాసదొర, పీహెచ్ఓ చిట్టిబాబు, పీఏఓ రాంబాబు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ హామీలు అమలుచేయకుండా

కూటమి ప్రభుత్వం మోసం

పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు



మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు : రాష్ట్ర ప్రజలకు ఎన్నికల సమయంలో అరచేతిలో వైకుంఠం చూపించి సూపర్ సిక్స్ హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలకు పంగనామాలు పెట్టిందని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు స్పష్టం చేశారు. తన కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమలు కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి హామీలు అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు ఫిలాసఫీ మాట్లాడటం ఏమిటని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి సుమారు తొమ్మిది నెలలు కావస్తున్నా ఏ ఒక్క సంక్షేమ పథకం అమలు చేయకుండానే సుమారు రూ.1.19లక్షల కోట్లు అప్పులు చేసి నిలువునా దోచుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలకు సంపద సృష్టిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సహా మంత్రులు, కూటమీ పార్టీల ఎమ్మెల్యే, నాయకులు సంపద సృష్టించుకుంటున్నారని విమర్శించారు. గతంలో కుల, మత, ప్రాంత, పార్టీ, వర్గ బేధాలు లేకుండా ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా నూరుశాతం అమలు చేసి చూపించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. మరలా ఆ స్వర్ణయుగాన్ని రాష్ట్ర ప్రజలు ముక్తకంఠంతో కోరుకుంటున్నారన్నారు. కూటమీ ప్రభుత్వ పాలనపై రాష్ట్ర ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసేంత వరకు వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందన్నారు. సర్పంచ్ గబ్బాడ చిట్టిబాబు, వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు తిమోతి, పార్టీ మహిళ విభాగ నియోజకవర్గ అధ్యక్షురాలు ఊర్వశి రాణి, మాజీ సర్పంచ్ శరభ సూర్యనారాయణ, నాయకులు రాజేష్, మహేష్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు కలెక్టర్ ఆర్థిక సాయం



మృతి చెందిన బాలుడి తల్లిదండ్రులకు ఆర్థిక సాయమందిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి, పాడేరు: వృషణాలు మెలితిరగడంతో కేజీహెచ్‌లో సర్జరీ జరుగుతుండగా బాలుడు మృతి చెందిన సంఘటన బాధాకరమని కలెక్టర్ ఎ.ఎస్. దినేష్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. చింతపల్లి మండలం చౌడుపల్లి పంచాయతీకి చెందిన బూర్జ జేమ్స్ అనే రెండేళ్ల బాలుడు మంగళవారం కేజీహెచ్‌లో మృతి చెందడంతో తల్లిదండ్రులు తమకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం రాత్రి కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిశారు. వారిని కలెక్టర్ పరామర్శించారు. బిడ్డ మరణంతో దుఃఖం అనుభవిస్తూ రెండు రోజులుగా ఆకలితో ఉన్న తల్లిదండ్రులు ఝాన్సీరాణి, గణపతిలకు కలెక్టర్ ధైర్యం చెప్పారు. పండ్లు, బిస్కట్లను వారికి అందజేశారు. బాలుడు మరణంపై కలెక్టర్ మాట్లాడుతూ కేజీహెచ్ సూపరింటెండెంట్‌తో సర్జరీ చేసిన వైద్యులను విచారించారని, వైద్య బృందాల తప్పేమి లేదని తేలిందన్నారు. బాలుని వృషణాలు మెలితిరగడంతో రక్తసరఫరా అందక కుళ్లిపోయి నొప్పితో బాధపడుతున్నాడని, తప్పనిసరి పరిస్థితిలో సీనియర్ వైద్యుడు సర్జరీ చేశారని ఆయన తెలిపారు. వైద్యులతో పాటు డయగ్నోస్టిక్‌లోను ఎలాంటి తప్పిదాలు లేవన్నారు. బాలుడు మృతి విచారకరమన్నారు. బాలుడు అంత్యక్రియలకు సంబంధించి కొంత ఆర్థిక సాయాన్ని బాధిత తల్లిదండ్రులకు కలెక్టర్ దినేష్‌కుమార్ అందజేశారు.

ఆన్‌లైన్ వ్యభిచారం కేసులో ఐదుగురి అరెస్ట్

అల్లిపురం: అమాయకత్వంగా, ఆర్థిక అవసరాలు కలిగిన యువతులు, మహిళలను లక్ష్యంగా చేసుకుని, సులువుగా డబ్బులు సంపాదించే ఆశ చూపి పెద్ద ఎత్తున ఆన్‌లైన్ వ్యభిచారాన్ని నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులను టూటౌన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు ఈస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ ఒక ప్రకటన విడుదల చేశారు. నిందితులు మద్దిలపాలెం, చైతన్యనగర్‌కు చెందిన గొర్లె నరేష్, వన్‌టౌన్, లక్ష్మీ టాకీస్ ప్రాంతానికి చెందిన గంగిరి పవన్ కల్యాణ్ అలియాస్ బాబీ, శ్రీకన్య థియేటర్ దరి, సుబ్బలక్ష్మీ నగర్‌కు చెందిన నీలగిరి వెంకటలక్ష్మి, ఆరిలోవ, దుర్గాబజార్‌కు చెందిన గంగిరి పద్మ, విజయనగరం జిల్లా, లక్కవరపు కోటకు చెందిన పెదగాడి శ్రీనులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఇదే కేసులో గతంలో 11 మందిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ ప్రయోగ పరీక్షలు

జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ



మాట్లాడుతున్న జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ

సాక్షి,పాడేరు: జిల్లాలో ఇంటర్ ప్రయోగ,పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని.జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్ గౌడ ఆదేశించారు.ఇందుకు సంబంధించి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 5వతేదీ నుంచి 20వతేదీ వరకు జిల్లావ్యాప్తంగా 60 కళాశాలల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఇంటర్ పబ్లిక్ పరీక్షలు మార్చి ఒకటి నుంచి 15 వరకు జరుగుతాయన్నారు. పాడేరు డివిజన్‌లో 16, రంపచోడవరం పరిధి7, చింతూరు పరిధిలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జెరాక్స్ సెంటర్లు మూసివేతకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రంపచోడవరం, చింతూరు డివిజన్‌లకు సంబంధించి రాజమండ్రి ఇంటర్‌బోర్డు ప్రాంతీయ కార్యాలయం, పాడరు డివిజన్‌కు సంబంధించి అనకాపల్లి జూనియర్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో ఇంటర్‌బోర్డు జిల్లా అధికారి అప్పలరాము, డీఈవో బ్రహ్మాజీరావు,ఏపీసీ స్వామినాయుడు, గిరిజన సంక్షేమశాఖ డీడీ రజనీ,డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, డీపీఆర్వో గోవిందరాజులు పాల్గొన్నారు.

గిరిజన చట్టాలను హరిస్తే సహించం

▶7వ పేజీ తరువాయి

నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. గిరిజనేతరులు నిర్మిస్తున్న అక్రమ కట్టడాలకు ఏజెన్సీలోని కూటమి నేతలే బినామీలుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో సర్పంచ్ గబ్బాడ చిట్టిబాబు, వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు తిమోతి, పార్టీ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు ఊర్వశిరాణి, మాజీ సర్పంచ్ శరభ సూర్యనారాయణ పాల్గొన్నారు.

చట్టాలు నిర్వీర్యానికి కుట్ర: గిరిజన సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

పాడేరు రూరల్: గిరిజన చట్టలు, హక్కులను నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రకు తెరలేపిందని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్రం ధ్వజమెత్తారు. జిల్లా కేంద్రం పాడేరులో బుధవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనులకు రక్షణగా ఉన్న 1/70 చట్టం సవరణ చేయాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చులకన భావంతో వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. గిరిజన హక్కులు, చట్టాలను పరిరక్షించాల్సిన పాలకులే ఈ విధంగా వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. గిరిజన ప్రాంతాల్లోని బాక్సైట్ ఖనిజ సంపదను దోచుకునేందుకే గిరిజన చట్టాలు సవరణ పేరిట నిర్వీర్యం చేసేందుకు కొత్త డ్రామాకు కూటమి ప్రభుత్వం తెరలేపిందన్నారు. స్పీకర్ చేసిన వ్యాఖ్యలపై కూటమి ప్రభుత్వం బాధ్యత వహిస్తూ స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే కులమతాలకు అతీతంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు నాగేశ్వరరావు, రాధాకృష్ణ, జీవన్, కార్తీక్, కృష్ణ, లక్ష్మణ్, బొజ్జన్న పాల్గొన్నారు.

1/70 ఆదివాసీలకు జీవనాడి



చింతూరులో మాట్లాడుతున్న బంగారు వెంకటేశ్వర్లు

చింతూరు: ఆదివాసీల అభివృద్ధికి 1/70 వంటి చట్టాలు జీవనాడి లాంటివని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం చింతూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీలకు రక్షణకవచం లాంటి ఈ చట్టాన్ని సవరణ చేయాలంటూ శాసనసభ స్పీకర్ మాట్లాడడం సరికాదన్నారు. పవిత్రమైన పదవిలో ఉన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదివాసీలకు రక్షణ కల్పించే చట్టాలపై గౌరవం లేకుండా మాట్లాడడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లోని చట్టాలు, జీవోలను పటిష్టంగా అమలు జరిగేలా రాష్ట్రస్థాయిలో ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని, ఆదివాసీ చట్టాలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన స్పీకర్‌పై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం చినవీరభద్రం, సోడె రాఘవయ్య, ప్రసాద్, వెంకటేశ్వర్లు, కృష్ణ, లక్ష్మణ్, కోటి, రాజు, శ్రీరాములు పాల్గొన్నారు.

వాడపల్లిలో గిరిజనుడి దారుణ హత్య

- తాటి మట్టతో అతికిరాతంగా గొంతుకోసిన దుండగులు
- చేపల చెరువుల వివాదమే కారణమని ప్రచారం
- కేసు నమోదు చేసిన పోలీసులు
- అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని వెల్లడి



చిన్నరెడ్డి మృతదేహం

రంపచోడవరం: మండలంలోని వాడపల్లి గ్రామంలో దారుణ హత్య చోటుచేసుకుంది. వాడపల్లి గ్రామానికి చెందిన బచ్చల నాగేశ్వరరెడ్డి అనే గిరిజనుడు మామిడి తోటకు కాపలాగా ఉన్న గిరిజనుడు ఒంటుకుల చిన్నరెడ్డి (55)ని దుండుగులు అతికిరాతకంగా కర్రలతో కొట్టి, తాటిమట్టతో గొంతుకోసి హత మార్చారు. మంగళవారం రాత్రి 11 నుంచి రెండు గంటల మధ్య ఈ ఘటన జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు మారేడుమిల్లి మండలం దెందులూరు గ్రామానికి చెందిన వాడు. నాగేశ్వరరెడ్డి మామిడి తోటకు కాపలాగా ఉన్న వ్యక్తి ఊరు వెళ్లడంతో చిన్నారెడ్డిని కాపలాగా పెట్టినట్టు తెలిపారు. మారేడుమిల్లి మండలం వైదిపూడి గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కలిసి హత్యకు పాల్పడినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. చేపల చెరువులకు సంబంధించిన వివాదమే ఈ ఘటనకు కారణంగా తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు అన్ని కోణాల్లో విచారణ మొదలు పెట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ భూషణం తెలిపారు.

నిర్వాసితులను దగా చేస్తున్న ప్రభుత్వాలు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నేత మధు

చింతూరు/కూనవరం: పోలవరం నిర్వాసితుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని సీపీఎం మాజీ రాష్ట్ర కార్యదర్శిపెనుమల్లి మధు విమర్శించారు. సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలవరం పోరాట పతాకయాత్రలో భాగంగా బుధవారం చింతూరు, కూనవరం మండలాల్లో జరిగిన సభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పోలవరం పూర్తి చేయకుండాకాలం వెళ్లబుచ్చుతోందని, నిర్వాసితుల ఊసే ఎత్తడంలేదన్నారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం త్యాగం చేసిన నిర్వాసితుల భూములకు ఎకరాకు రూ.50 లక్షలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పునరావాసం కల్పించడంలో ప్రభుత్వాలు సరైన నిర్ణయం తీసుకోకపోవడంతో బాధితులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలుచోట్ల నిర్మించిన పునరావాస కాలనీలు ఏటా వరదలకు మునుగుతున్నాయని, ఇది ముమ్మాటికి ప్రభుత్వ అవగాహన రాహిత్యమేనని ఎద్దేవా చేశారు. టీడీపీ, జనసేన పార్టీలు బీజేపీకి తొత్తుగా మారుతూ గిరిజనుల మనుగడకు ప్రమాదం తెస్తున్నాయని హెచ్చరించారు. పార్టీ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాలు కాంట్రాక్టర్ల దగ్గర డబ్బు దండుకోవడం తప్ప ప్రజకు ఏమాత్రం న్యాయం జరగడం లేదన్నారు. రామారావు, సుబ్బారావు, రాజులు, నాగేశ్వరరావు, వెంకట్, సురేష్, శ్రీనివాసరావు, సంతోష్‌కుమార్, చిన్నబాబు, నాగేశ్వరరావు, లక్ష్మి, పెంటయ్య, బొర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కోడి పందాలను అరికట్టాలి

రంపచోడవరం: రంపచోడవరం మండలంలో జోరుగా కోడి పందెలు జరుగుతున్నట్టు రంపచోడవరం ఎంపీపీ బందం శ్రీదేవి ఆరోపించారు. ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో విచ్చల విడిగా కోడి పందెలు జరుగుతున్నా పోలీసులు స్పందించడం లేదన్నారు. ఇటీవల తాళ్లపాలెం సమీపంలో కోడి పందెలు జరిగాయన్నారు. మండలం జూదాలకు అడ్డగా మారిందన్నారు. కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయన్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు రైళ్లకు ఆయా తేదీల వరకు తాత్కాలికంగా అదనపు కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

- విశాఖపట్నం-గుణుపూర్-విశాఖపట్నం(58506/58505) పాసింజర్‌కు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 28వ తేదీ వరకు 1-స్లీపర్ క్లాస్ కోచ్.
- భువనేశ్వర్-కేఎస్ఆర్ బెంగళూరు(18463) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 28వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో కేఎస్ఆర్ బెంగళూర్- భువనేశ్వర్(18464) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు ఫిబ్రవరి 2వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు 1-థర్డ్ ఏసీ కోచ్.
- భువనేశ్వర్-తిరుపతి (22879) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 22వ తేదీ వరకు (రైలు నడిచే రోజుల్లో), తిరుగు ప్రయాణంలో తిరుపతి-భువనేశ్వర్(22880) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఫిబ్రవరి 2వ తేదీ నుంచి 23వ తేదీ వరకు 1-థర్డ్ ఏసీ కోచ్.
- సంబల్‌పూర్ - నాందేడ్ (20809) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఫిబ్రవరి 2వ తేదీ నుంచి 28వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో నాందేడ్-సంబల్‌పూర్(20810) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఫిబ్రవరి 3వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు 1-థర్డ్ ఏసీ, 1-స్లీపర్ క్లాస్ కోచ్.
- సంబల్‌పూర్-ఈరోడ్(08311) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఫిబ్రవరి 5వ తేదీ నుంచి 26వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో ఈరోడ్- సంబల్‌పూర్(08312) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఫిబ్రవరి 7వ తేదీ నుంచి 28వ తేదీ వరకు 1-థర్డ్ ఏసీ, 1-స్లీపర్ క్లాస్ కోచ్.
- భువనేశ్వర్-జునాగడ్(20837) ఎక్స్‌ప్రెస్‌కు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 28వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో జునాగడ్-బువనేశ్వర్(20838) ఎక్స్‌ప్రెస్‌కు ఫిబ్రవరి 2వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు 1-స్లీపర్ క్లాస కోచ్.
- పూరీ-యశ్వంత్‌పూర్(22883) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు ఫిబ్రవరి 7వ తేదీ నుంచి 28వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో యశ్వంత్‌పూర్ -పూరి(22884)గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు ఫిబ్రవరి 8వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు 1-థర్డ్ ఏసీ ఎకానమి కోచ్.
- భువనేశ్వర్-జగదల్‌పూర్(18447) హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్‌కు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 28వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్-భువనేశ్వర్(18448) హిరాకండ్ ఎక్స్‌ప్రెస్‌కు ఫిబ్రవరి 2వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు ఒక స్లీపర్ క్లాస్ కోచ్ జతచేస్తున్నారు.

గ్రామసభ నిర్వహించాలని వినతి



చింతూరులో ఐటీడీఏ పీవోను కలిసి వస్తున్న మర్రిగూడెం నిర్వాసితులు

కూనవరం: పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ ముంపు గ్రామం అయిన మర్రిగూడెంలో అవార్డు ఎంక్వైరీ గ్రామసభ నిర్వహించాలని కోరుతూ గ్రామానికి చెందిన 60 కుటుంబాల నిర్వాసితులు బుధవారం చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022, ఆగస్టు 10న మర్రిగూడెం గ్రామానికి చెందిన 60 కుటుంబాలు పోలవరం ముంపునకు గురవుతున్నట్టు గుర్తించి, ఇంటింటా సర్వే నిర్వహించారని తెలిపారు. స్ట్రక్చర్ వ్యాల్యూ అంచనాలు సైతం తయారు చేశారని వినతిలో పేర్కొన్నారు. అన్ని సర్వేలు పూర్తయినా ఇప్పటి వరకు గ్రామసభ నిర్వహించ లేదన్నారు. తక్షణం గ్రామసభ నిర్వహించి తమకు న్యాయం చేయాలని వారు పీవోను కోరారు. దీనిపై ఐటీడీఏ పీఓ సానుకూలంగా స్పందించినట్టు నిర్వాసితులు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎ.ఆదిలక్ష్మి, డి.అలివేలు, బి.కామేశ్వరి, సీహెచ్.లక్ష్మణరావు, వి.వీరాస్వామి, ఎస్.సిద్దార్థ, బి.నాగేశ్వరరావు, కె.జగ్గయ్య, డి.సుజాత, డి.లక్ష్మణరావు తదితరులున్నారు.

లాహిరి లాహిరి లాహిరిలో..



తెప్పోత్సవంని తిలకిస్తున్న భక్తులు

- తెప్పోత్సవంలో హంస వాహనంపై అప్పన్న
- వేణుగోపాలస్వామిగా భక్తులకు దర్శనం

సింహాచలం: పుష్య బహుళ అమావాస్యను పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవం బుధవారం కనులపండువగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేతుడై స్వామివారు వేణుగోపాలస్వామిగా దర్శనమిచ్చాడు. హంస వాహనంపై నౌకావిహారంలో కనువిందు చేశాడు. ఉత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులతో వరాహపుష్కరిణి కిటకిటలాడింది. సాయంత్రం సింహగిరి నుంచి మెట్లమార్గం ద్వారా కొండదిగువకి తొలిపావంచా వద్దకు చేరుకున్న స్వామికి అధికారులు, అడవివరం గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఊరేగింపుగా వరాహ పుష్కరిణి వద్దకు తీసుకెళ్లారు. శోభాయమానంగా అలంకరించిన హంసాకృతి నౌకపై స్వామిని కొలువుంచి, తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మండపంలో స్వామిని వేంజేపచేసి విష్వక్సేణపూజ, పుణ్యాహవచనం, షోడషోపచార పూజలు, విశేష ఆరాధనలు, పారాయణాలు జరిపారు. ఆ తర్వాత స్వామిని పుష్కరిణి సత్రం వద్దకు తీసుకొచ్చి సర్వజన మనోరంజని వాహనంపై గ్రామ తిరువీధిని విశేషంగా నిర్వహించారు. దేవస్థానం ఈవో త్రినాథరావు, దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, వేద పండితులు, పారాయణదారులు ఈ ఉత్సవాన్ని నిర్వహించారు.

తొలిసారిగా ఏపీఎస్ఆర్‌డీఎఫ్ సేవలు

తెప్పోత్సవానికి అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. వరాహ పుష్కరిని, హంస వాహనాన్ని సుందరంగా అలంకరించారు. విద్యుద్దీపాలంకరణ చేశారు. గోపాలపట్నం లా అండ్ ఆర్డర్ సీఐ గొలగాని అప్పారావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తొలిసారిగా ఏపీఎస్ఆర్‌డీఎఫ్ బృందం భద్రతా చర్యలకు వచ్చింది. రెండు బోట్లు, 15 మంది సిబ్బంది తెప్పోత్సవానికి తరలి వచ్చారు.